కథ

# బహుమతి

తెన్నేటి కాశివిశాలాక్షిదేవి

బ్రహ్మాలోకంలో సకల జీవులు సమావేశమయ్యాయి.
ప్రతి జీవి తరపున ఒక ప్రతినిధిని రప్పించాడు బ్రహ్మ.
పిచ్చాపాటి ముగిసే సందర్భంలో లోకసంచారి నారదుడు ఒక సందేహం వెలిబుచ్చాడు.
"విధాతా! ఇప్పటిదాకా సకల జీవుల ఉత్తమ గుణాల గురించి తమరు తెల్సుకున్నారు – ఉత్తమ జీవులకు బహుమతులు యిచ్చారు. కాని నాకు కూడా ఒక ఆలోచన వచ్చింది. తమరి సృష్టిలో కెల్లా నీచాతినీచమ్మైన జంతువు ఏదో తెలుసుకోవాలని ఉంది." నారదుడు తంబూర తీసుకుని మీటుతూ అడిగాడు.
చిరునవ్వు చిందించాడు దేవేంద్రుడు. "మహానుభావా! దీంట్లో ఆలోచించాల్సింది ఏముంది! పంది నీచ జంతువు – జంతువుల మలము తిని బతుకుతుంది".



వెంటనే బృహస్పతి అభ్యంతరం తెలియచేశాడు. "దేవేంద్రా! వరాహం లేనిచో లోకమంతా గబ్బు పడుతుంది. అది నిస్వార్థంగా మలినాలను శుభ్రం చేస్తున్నది. నా దృష్టిలో వరాహం చాలా గొప్ప జంతువు. దాన్ని ఆదర్శంగా మనం పని చెయ్యాలి!"

శుక్రాచార్యుడు తన ఒంటి కంటితో వ్రాక్కుచ్చాడు గడ్డం నిమురుకుంటూ "చతుర్వేద పారాయణా! లోక రక్షయణా! నీలకంఠా – నా దృష్టిలో సింహం నీచాతినీచమ్మైన జంతువు. విచక్షణ లేకుండా కనిపించిన జంతువును చంపివేస్తుంది. దాని ఆకలికే అడవి ఖాళీ అయిపోతుంది. అతి క్రూర నీచజంతువు సింహం!"

విధాత సగం నవ్వునవ్వాడు.

"శుక్రాచార్యా! నువ్వు వక్రంగా ఆలోచిస్తున్నావు! సింహరాజం ఆకలి తీరింతర్వాత ఏ జంతువును ఉత్తినా వధించదు! రేపు ఆకలి వేయవచ్చు అని ఊహించి ముందుగానే తన ఆహారాన్ని సేకరించుకోదు" అని బృహస్పతి అడ్డుపడ్డాడు.

ఇలా చర్చ రసవత్తరంగా జరుగుతున్నది.

అప్పుడు విశ్వామిత్రుడు లేచి అన్నాడు. ''పెద్దలకు ఇలా సభాసమయం వృధా చేయడం తగదు. విధాత సృష్టిలో నీచాతినీచమైన సృష్టి మానవుడే! ఇంత చిన్న విషయానికి యింతలా తలకాయలు పట్టుకోవడం సిగ్గుచేటు'' అని చెప్పాడు.

అందరూ నివ్వెరపోయారు. నోట మాటరాలేదు. ముఖ్యంగా బ్రహ్మకున్న నాలుగు శిరస్సులు గిర్రున తిరిగిపోయాయి. రోషం ముంచుకు వచ్చింది. అంతకుముందే మానవుడికి అతను ఉత్తమ సృష్టి అని బహుమతి ప్రదానం చేశాడు వాణి సాక్షిగా.

''విశ్వామిత్రా! ఆపు! నువ్వు చెప్పింది సబబుగా లేదు. నీలాగా సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్నాడు. కృత్రిమంగా మానవుడ్ని తయారు చేస్తున్నాడు. గ్రహాలను గాలిస్తున్నాడు - విజ్ఞానపరంగా ఎంతో ఎదిగిపోయాడు - అటువంటి మానవులను ఆక్షేపించావో - నీకు తగిన శాస్తి జరుగుతుంది''. బ్రహ్మ విశ్వామిత్రుడితో వాగ్వివాదానికి తలపడ్డాడు.



విశ్వామిత్రుడు తన కోపాన్ని తొక్కిపట్టి వ్యంగ్యాస్త్రం అందుకున్నాడు. ''విధాతా! నీరాత సరిగా లేదయ్యా! వయసు మళ్ళిందో ఏమో – మానవుడి నుదిట రాత ఏం రాస్తున్నావో గమనించే వారు లేరు. నువ్వు పాపం వాళ్ళకు తెలివితేటలు యిచ్చావనుకున్నావు – అవిదేనికి వాడుతున్నాడు వాడు? ఎదుటి మనిషిని హింసించడానికి – చంపడానికి వాడుతున్నాడు. నీకు ఉదాహరణ కావాలంటే ఏదేశ చరిత్ర అయినా పరిశీలించు – హిరోషిమా – నాగసాకి బాంబు దాడులేమిటి? – గెరిల్లా యుద్ధాలు ఏంటి? తీవ్రవాదమేంటి? శాంతిదళం ఏమిటి? – పేరు ఏదైనా పనిచేసేది తుపాకీనే – పోయేది ప్రాణమే? ఎవరైనా బాగుంటే ఓర్వలేడు. తనకు లేదు – ఇంకోడికి ఉంది అని ఒకటే ఏడుపు – ఎదుటివాడి సొమ్ము దోచుకునే దాకా నిద్ర పట్టదు. దోచుకున్న వాడిని 'దొంగ' అనకుండా 'వీరుడు'గా గౌరవిస్తారు! ఎంత పెద్దదొంగ అయితే చరిత్రలో అంత గొప్ప వీరుడిగా ఉండి పోతాడు. అలెగ్జాండరు ప్రపంచయాత్ర ఎందుకు జరపాల్సి వచ్చింది? గజనీ మహమ్మద్ ఎందుకు 17 సార్లు భారతదేశం పైకి దండయాత్ర జరపాల్సి వచ్చింది?'' విశ్వామిత్రుడు కమండలం ఎత్తుకుని గటగట నీళ్ళు తాగాడు పెద్దల బుర్రలకు పని కల్పిస్తూ.

''అదేంటి విశ్వామిత్రా – శౌర్యానికి వక్రభాష్యం చెబుతున్నావు శుక్రాచార్యుడిలా నీవు?'' బృహస్పతి లబలబ కొట్టుకున్నాడు.

''అందరూ దమనులు – రాక్షసులు అని మమ్మల్ని ఆడిపోసుకునే వాళ్ళే! మాకున్న నీతి మానవ జాతికుందా! మేము ఎన్నిసార్లు దేవలోకాన్ని ఆక్రమించినా మా నీతిని అతిక్రమించలేదు. కామాంధులమై – కండకావరంతో పరస్త్రీలను చెరబట్టలేదు – జాతి ద్వేషంతో దేవతల జాతిని సమూలంగా నిర్మూలించలేదు – అలాగే మా నెత్తురే గొప్ప అని గొప్పలు యిబ్బడి ముబ్బడిగా చెప్పుకోలేదు'' శుక్రాచార్యుడు ఆక్రోశించాడు అనంతంగా.

''పైగా రాక్షసులు విజ్ఞానపరంగా కూడా ఎంతో అభివృద్ధి చెందినా దేవతల కొచ్చిన పేరు వారికి రాలేదు – అంటే ఇది దేవర పక్షపాతం కాదా – ఆలోచించండి!'' నారదుడు చురక అంటించాడు.

దేవేంద్రుడికి ఎక్కడో చురుక్కుమంది. ''అదేంటి విజ్ఞానంలో మమ్మల్ని అధిగమించారా రాక్షసులు! మా అశ్వినీ కుమారులుండగా వారికి ఎవరుసాటి!'' ఖండించాడు దేవేంద్రుడు సాహస్రాక్షులు తెరిచి.

''మరి ఎందుకు స్వామి కచుడిని శిష్యరికం చేయమని పంపించావు? శుక్రాచార్యుడి నుండి దొంగతనంగా మృత సంజీవని విద్యను అపహరించ ప్రయత్నించావు?'' నారుదుడి ప్రశ్న. కీలెరిగి వాత పెట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

''అంతేనా! క్షీరసాగర మథనం చేస్తుండగా లభించిన అమృతం స్వార్థంతో దేవతలంతా త్రాగేశారు – మాకు కల్లు, అమృతం వారికి! ఇది కూడా దేవరవారి పక్షపాతమే!'' శుక్రాచార్యుడు కినుక వహించాడు.

శ్రీ మహావిష్ణువు చర్చ దారి తప్పుతున్నదని గ్రహించి తటాలున శంఖు, చక్ర, గదలతో పైకి లేచాడు. ఎవరికి మూడిందా అనుకుంటూ గరుత్మంతుడు బద్ధకం వదిలించుకుని ఒక్క గంతు వేసి సిద్ధంగా నిలబడ్డాడు.

''సభాసదులకు నేను చెప్పేదేమిటంటే ఎవరూ చరిత్ర తరచి చూడద్దు. మానవులలోని శ్రీశ్రీ ముందే సెలవిచ్చాడు – ఏ చరిత్ర చూసినా ఏమున్నది. గర్వకారణం' అని – కాబట్టి చరిత్రల జోలికి పోకుండా చర్చలు కొనసాగించండి. ప్రస్తుత విషయం – సృష్టిలో కెల్లా నీచమైన జంతువు ఏది అని – కొందరు సింహం అన్నారు – కొందరు పంది అన్నారు – ఈ రెండూ కాకుండా యింకెవరైనా ఇంక దేన్నైనా ప్రతిపాదిస్తారా! విశ్వామిత్రుల వారి అభిప్రాయంలో మానవుడు నీచ సృష్టి- మరి సమర్థిస్తారా?'' విష్ణువు అడిగాడు.

లోక సాక్షి భాస్కరుడు లేచి నిలబడి చెప్పాడు! ''లోకరక్షకా! చూడగా చూడగా – ఆలోచించగా ఆలోచించగా – నాకు కూడా అలాగే అనిపిస్తున్నది''.

పెద్దాయన అలా సెలవిచ్చిం తర్వాత తాను మెదలకుండా ఉంటే బాగుండదని చందమామ లేచి నిలబడి విన్నవించాడు. ''మహాప్రభూ! సహస్ర కిరణుల భాస్కరులే మానవుడి దురాగతాలు భరించలేక కళ్ళు మూసుకుంటూ ఉంటే – ఇంక చీకట్లో నరజాతి చేసే అకృత్యాలు చూడలేక నేను మబ్బుచాటుకు పోతున్నాను. రాత్రి అయితే మనిషిలోని రాక్షసుడు లేచి నిల్చుంటాడు – రాక్షసుడు అని మనం దానవులతో పోల్చి దానవులను కించ పరచకూడదు. అబ్బబ్బ! ఒక వావి వరుస లేదు – చిన్నంతరం – పెద్దంతరం లేదు – ఎక్కడచూసినా డబ్బుగబ్బే! ఆ డబ్బు కోసం ఏం చేయమన్నా చేస్తాడు – ఎంత నీచానికైనా దిగజారతాడు'' చందమామ కన్నీటి బిందువులు కారుస్తూ మాట్లాడలేక మబ్బుల చాటుకు వెళ్ళిపోయాడు. సోదరుడి పరిస్థితికి నల్ల లక్ష్మి మెల్లగా విచారించింది.

శుక్రాచార్యుడు గళం విప్పాడు. ''మా దానవులెవరు తోటి దానవుల్పైన అత్యాచాలు చేసిన దాఖలాలు లేవు. కాని మనిషి మటుకు తోటి మనిషిని అన్నిరకాలుగా భ్రష్టు పట్టిస్తాడు – నరమాంస భక్షకుడు! ఏ జంతువూ తన జాతి జంతువును చంపి తినదు – కానీ నీచ మానవుడు మనుషులను తినడమే కాదు – ఆహారానికి పనికి రాకపోయినా యితరులను చంపి పాతేస్తాడు''.


''అనవసరంగా ఈ దేవేంద్రుడ్ని చుప్పనాతివాడని లోకం ఆడిపోసుకుంటుంది. కాని ఈర్ష్యకు – అసూయకు – చుప్పనాతి తనానికి పెట్టింది పేరు మనిషి. ఎవరు చల్లగా – పచ్చగా ఉంటే చూడలేడు. ఎప్పుడూ తనకంటే ఉన్నతుల నాశనాన్ని కోరుకుంటూ ఉంటాడు. ఎదుటి వాడు నష్టపోతే తనకు వచ్చే లాభం లేకపోయినా నిరంతరం యితరులకు కష్టాలు – నష్టాలు కలగాలని కాంక్షిస్తూ ఉంటాడు. పైగా ఇతరుల అభివృద్ధికి అడ్డుపుల్ల వేస్తూ ఉంటాడు. ఈ మానవుల్లో కల్లా ఆంధ్రజాతి అతి నీచజాతి! పొరుగువాడు పైకి పోకుండా తొక్కిపెడుతూ ఉంటాడు'' నారద ఉవాచ.

''ఈ ఈర్ష్య కల్గిన జంతువు ఒక్క మనిషే! ఈ అనసూయ వలన పచ్చని బ్రతుకులు మంట గలసిపోయాయి. కాబట్టి సృష్టిలో కెల్లా నీచాతినీచ సృష్టి ఈ మానవుడు – విధాతకు రుజువులు కావాలంటే చూపిస్తాను'' విశ్వామిత్రుడు చెప్పాడు.

విధాత వద్దని వారించాడు. సరస్వతి తన ఆమోదం తెలుపుతూ మహతి శృతి చేసింది.

''విశ్వామిత్రా! నువ్వుచెప్పింది సత్యమని నమ్ముతున్నాను – నిన్ను మానవులలో పుట్టించి నందుకు విచారిస్తున్నాను – ఈ నీచ బహుమతి నువ్వే అందుకో!'' బ్రహ్మ ఓ జ్ఞాపికను అందించాడు. బహుమతిని అందుకున్నాడు విశ్వామిత్రుడు.

*




చిరునామా:
కాశి విశాలాక్షిదేవి
విజ్ఞాణ మందిర్ హై స్కూల్,
ద్వారకానగర్, బి–క్యాంప్ (పోస్ట్)
కర్నూల్ – 518001 (ఎ.పి.)